సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 28 । జనవరి । 2025



ట్రైకార్ పథకాలకు ప్రతిపాదనలు

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ట్రైకార్ పథకాల అమలుకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పెట్టినట్టు ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బి.శ్రీనివాసులు అన్నారు. - 8లో



నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారులు

హైదరాబాద్‌లో మంగళవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారులు పయనమయ్యారు. - 8లో

జిల్లా అదనపు ఎస్పీగా నాగేశ్వరి

పార్వతీపురంటౌన్: జిల్లా అదనపు ఎస్పీగా ఎల్.నాగేశ్వరిని నియమిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం అదనపు ఎస్పీగా పనిచేస్తున్న డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్‌ను ఏసీబీకి బదిలీచేస్తూ ఈ నెల 7వ తేదీన ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

న్యూస్‌రీల్

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం వద్ద ఆందోళన చేస్తున్న వీఓఏలు

పార్వతీపురం: వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న వీఓఏ (యానిమేటర్స్)ల ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యామల మన్మథరావు మాట్లాడుతూ వీఓల ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలన్నారు. గ్రామాల్లో రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన వీఓఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షులు రామారావు, శ్రామిక మహిళా సంఘ నాయకురాలు వి.ఇందిరతో పాటు పార్వతీపురం, భామిని, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, బలిజిపేట మండలాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థి మర్మాంగంపై యాసిడ్ వంటి ద్రావణంతో దాడి



మాట్లాడుతున్న విద్యార్థి చైతన్య

సాలూరు: సాటి విద్యార్థిపై మరో విద్యార్థి యాసిడ్ వంటి గాఢత గల ద్రావణాన్ని మర్మాంగంపై పోసి దాడిచేసిన ఘటన సాలూరు పట్టణంలోని పీఎన్ బొడ్డవలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగింది. బాధిత విద్యార్థి, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బొడ్డవలస గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చింతగడ చైతన్య ఆదివారం రాత్రి హాస్టల్‌లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మరో విద్యార్థి యాసిడ్‌వంటి గాఢత గల ద్రావణంతో చైతన్య మర్మాంగంపై పోసి గాయపరిచాడు. ఆ ద్రావణం పడగానే మర్మాంగంపై పొక్కులు వచ్చి చైతన్యకు తీవ్రగాయాలయ్యాయి. తమ బిడ్డ పరిస్థితిని తెలుసుకున్న పట్టణంలోని పెద్ద వీధికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు చైతన్యను వెంటనే పట్టణంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తమ బిడ్డకు తీవ్రగాయాలైనా ప్రిన్సిపాల్ పట్టించుకోకుండా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నామని బాధిత విద్యార్థి బంధువులు చెబుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ఆశీర్వాదం వివరణ కోరగా, బాధిత విద్యార్థిని పాఠశాలలో వైద్యసిబ్బంది పరీక్షించి ప్రమాదమేమీలేదని చెప్పారన్నారు. బాత్‌రూం క్లీనింగ్‌కు వినియోగించే షాంపూను దాడి చేసిన విద్యార్థి వాడినట్లు తెలిపారు.

వచ్చే ఖరీఫ్‌కు గుమ్మిడి గెడ్డ నీరు



గుమ్మిడిగెడ్డ ప్రాజెక్టు వద్దకు కాలినడకన వెళ్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు గుమ్మిడి గెడ్డ నుంచి సాగునీరు సరఫరా చేస్తామని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. కురుపాం మండలంలోని కరలగండ గ్రామంలోని గుమ్మిడిగెడ్డ ఆనకట్టను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి సోమవారం పరిశీలించారు. గుమ్మిడి గెడ్డను మినీ రిజర్వాయర్‌గా మారిస్తే కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల పరిధిలోని 5వేల ఎకరాలకు సాగునీటితో పాటు కురుపాం ప్రాంతానికి తాగునీరు లభించే అవకాశం ఉందని, దీనికోసం గతంలో రూ.49 కోట్లతో అంచనాలతో ప్రతిపాదనలు చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదని జలవనరుల శాఖ అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఖరీఫ్ నాటికి కాలువలను అభివృద్ధిచేసి సాగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ డి.రవికుమార్, కురుపాం సబ్ డివిజన్ మరియు సహాయక ఇంజినీర్లు జి.వి.రఘు, జి.భావన తదితరులు పాల్గొన్నారు. గుమ్మిడి గెడ్డ ప్రాంతానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో కలెక్టర్ ద్విచక్ర వాహనంపై కొంత దూరం, కాలినడకన మరికొంతదూరం ప్రయాణించి చేరుకున్నారు.

ఇసుక ఫ్రీ.. దోపిడీకే!

రాత్రీపగలూ తేడాలేదు... అడ్డుకుంటారన్న బెంగలేదు.. నాగావళి.. వంశధార తీరాలను ఇసుక దొంగలు దోచుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలు, పొక్లెయిన్లతో నదుల్లోని ఇసుకను తవ్వి సొమ్ముచేసుకుంటున్నారు. ఇసుక వ్యాపారంలో రూ.కోట్లు కూడబెట్టాలన్న లక్ష్యాన్ని 'జయ'ప్రదం చేసుకుంటున్నారు. పాలకొండను ఇసుక మాఫియాకు కేరాఫ్‌గా మార్చారు. దీనికి నదీ తీరాల్లో సాగుతున్న ఇసుక అక్రమతవ్వకాలు, అధికారులకు పట్టుబడుతున్న వాహనాలు.. స్థానికులు అడ్డుకుంటున్న ఘటనలే నిలువెత్తు సాక్ష్యం.



పాలకొండ మండలం గోపాలపురం నాగావళి తీరంలో మూడురోజుల కిందట నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుక తవ్వకం ఇలా

- పాలకొండ నియోజకవర్గంలో ఇసుక దందా
- పొక్లెయిన్లతో తవ్వకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు!
- కూటమి నాయకులే కీలక పాత్రధారులంటున్న జనం

సాక్షి, పార్వతీపురం మన్యం: పాలకొండ నియోజకవర్గంలో అటు వీరఘట్టం మండలం నుంచి ఇటు పాలకొండ వరకు సుమారు 37 కిలోమీటర్ల మేర నాగావళి నదీ తీరం ఉంది. ఇసుక అక్రమార్కులకు ఈ తీరం బంగారు కొండలా మారింది. అడ్డూ అదుపు లేకుండా ఇసుక దందా సాగుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలపై నిషేధం ఉన్నా.. కూటమి ప్రభుత్వంలో ఉచితంగానే పొందవచ్చన్న ప్రగల్భాలు పలికినా.. అవేవీ పట్టించుకోకుండా నదీ తీర ప్రాంతాలను అక్రమార్కులు తోడేస్తున్నారు. కళ్లెదుటే భారీ ఇసుక దందా సాగుతున్నా.. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్తులు ఫిర్యాదులు చేస్తున్నా చలించడం లేదు. వాహనాలు పట్టుబడుతున్నా.. వెంటనే విడిచిపెడుతున్నారు. దీనిపై కొన్నిచోట్ల గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాహనాలను అడ్డుకోవడం వంటివి మినహా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. పాలకొండకు చెందిన కూటమి నేత కనుసన్నల్లో ఇసుక అక్రమ వ్యాపారం సాగుతుండడంతో చూసిన వారు 'కృష్ణకృష్ణా'అనడం మినహా ఏమీ చేయలేకపోతున్నారు.

ఇసుక 'కొండ'...

జిల్లాలో ప్రధానంగా నాగావళి, వంశధార నదీ తీర ప్రాంతాల నుంచి ఇసుక లభ్యత సమృద్ధిగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక ఉచితమని ఆర్భాటంగా ప్రకటించింది. అధికారికంగా భామిని వద్ద రీచ్ ఏర్పాటు చేసినప్పటికీ.. అటు వివాదాలు, ఇటు దూరం కావడం వల్ల అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా పాలకొండ నియోజకవర్గంలో నాగావళిని చెరబడుతున్నారు. ఇసుకను తోడేస్తున్నారంటూ గత ప్రభుత్వ హయాంలో నానాయాగీ చేసిన ప్రస్తుత కూటమి ప్రభుత్వ నాయకుల కనుసన్నల్లోనే ప్రస్తుతం ఈ దందా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాటు బళ్ల ద్వారా స్థానిక ప్రజలు ఇసుకను తమ అవసరాల కోసం ఉచితంగా తీసుకువెళ్లచ్చన్న నిబంధన ఉంది. దీనినే ఆసరాగా చేసుకుని కూటమి నాయకులు అక్రమ దోపిడీకి తెరతీశారు. నాటుబళ్ల ద్వారా నది నుంచి ఇసుక తీసుకొచ్చి, ఒడ్డున కుప్పలుగా వేస్తున్నారు. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తూ, భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పాలకొండ మండలం నాగావళి నదీ తీరం నుంచి పెద్ద ఎత్తున తరలించేస్తున్నారు. పగలైతే ఇబ్బందులు వస్తాయన్న కారణంతో కొన్నాళ్లుగా రాత్రి వేళల్లో గ్రామాల మీదుగా తరలింపు జోరుగా సాగుతోంది. మరోవైపు కొందరు పోలీసులు, అధికారులు కూడా ఇందుకు సహకరిస్తున్నట్లు గ్రామస్తుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నాగావళి తీరంలో ఇసుక తరలింపునకు వీలుగా వేసిన మార్గం



ట్రాక్టర్‌కు పొక్లెయిన్‌తో ఇసుక లోడింగ్

అడ్డుకుంటున్నా ఆగని ఇసుక వ్యాపారం

- గతేడాది ఆగస్టు నెలలో పాలకొండ మండలంలోని గొట్టమంగళాపురం గ్రామం వద్ద ఇసుక అక్రమ తవ్వకాలను ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. లారీలకు అడ్డంగా నిలిచి ఆందోళన చేపట్టారు.
- గతేడాది ఆగస్టు 19వ తేదీన పాలకొండ మండలంలోని గోపాలపురం వద్ద అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతుండగా.. లారీ, జేసీబీని పోలీసులు సీజ్ చేశారు.
- గతేడాది ఆగస్టు 21వ తేదీన పాలకొండ మండలంలోని అంపిలి, అన్నవరం గ్రామాల మధ్య నదీతీరం నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అందిన ఫిర్యాదు మేరకు ఐదు ట్రాక్టర్లు, ఒక లారీని పోలీసులు సీజ్ చేశారు.
- ఇటీవల గోపాలపురం వద్ద సబ్‌కలెక్టర్ 19 వాహనాలను సీజ్ చేశారు.



నాగావళి తీరంలో ఇసుక పోగులు

- పాలకొండ మండల పరిధిలో నాగావళి నదీ తీరం నుంచి వినియోగదారులు నాటుబళ్లనే కాక.. ట్రాక్టర్లు, లారీల్లోనూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇటీవల జేసీబీలతో అక్రమ తవ్వకాలు జరుగుతుండగా.. సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి పట్టుకున్న విషయం విదితమే. రెండు జేసీబీలు, ఐదు టిప్పర్లు, 12 ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాస్తవానికి ఇక్కడ రోజుకు వందలాది వాహనాలతో రవాణా సాగుతోంది. ట్రాక్టరు ద్వారా లోడుకు రూ.1,500.. లారీ లోడుకైతే రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్నారు. జిల్లాలు దాటి వెళ్లాలంటే.. లారీ లోడు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. మండల పరిధిలోని అన్నవరం, మంగళాపురం గ్రామాల వద్ద నాగావళి నదీ తీరంలోనూ పెద్ద పోగులు వేసి అక్రమంగా తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతుండడంతో నాగావళికి ముప్పు ఏర్పడుతోంది. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ, వంతెన సమీపంలోనే పొక్లెయిన్లతో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు.
- అటు ఇదే నియోజకవర్గంలోని వీరఘట్టం మండలంలో సుమారు 12 కిలోమీటర్ల పొడవునా నాగావళి తీరం ఉంది. మండలంలోని పనసనందివాడ, బీటీవాడ నాగావళి నదీతీరం నుంచి ట్రాక్టరు ఇసుకను రూ.3 వేల నుంచి రూ.3,500 చొప్పున.. నాటుబండి అయితే రూ.800 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.
- నాగావళినే కాదు.. నియోజకవర్గ పరిధిలో ఉన్న వంశధారకూ ఇసుకాసురుల నుంచి గుండెకోత తప్పడం లేదు. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణాకు భామిని మండలం కేంద్రమైపోయింది. ఒడిశాకు సరిహద్దులో ఉండడం, వంశధారలో పుష్కలంగా ఇసుక మేటలు ఉండటంతో.. రెండు వైపులా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇక్కడ అధికారికంగా రీచ్‌లు ఉన్నప్పటికీ.. సాధారణ వినియోగదారులు అంత దూరం నుంచి నేరుగా తెచ్చుకునే సాహసం చేయడం లేదు. భామిని మండలం నేరడి.బి -బిల్లుమడ గ్రామాల మధ్య ఉన్న నదీ తీరం నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. దీని వెనుక నియోజకవర్గ కూటమి ప్రభుత్వ కీలక నేత, అతని బంధువు హస్తం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు ఊరుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వంశధార కాలువ గట్లపై నుంచి ఇసుకతో భారీ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల వంశధార కాలువ గట్లకు ప్రమాదం ఏర్పడుతోంది. నేరడి.బి– బిల్లుమడ గ్రామాల మధ్య సామాన్య ప్రజల రాకపోకలకూ వీలు లేకుండా చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ వ్యాపారం

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాట్లాడుతున్న పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి నాయకుల కనుసన్నల్లో పాలకొండ నియోజకవర్గంలో ఇసుక దోపిడీ పరాకాష్టకు చేరుకుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వాసరాయి కళావతి తెలిపారు. వండువలో విలేకరులతో ఆమె సోమవారం మాట్లాడుతూ జూన్ 4 సాయంత్రం నుంచి కూటమి నాయకులు ఇసుక ర్యాంపులకు తెర తీశారని.. దాదాపు 10 వరకు అనధికార ర్యాంపులు నడిపిస్తూ.. ఈ ఎనిమిది నెలల కాలంలో రూ.100 కోట్లకుపైగా దోపిడీకి తెర తీశారని ఆరోపించారు. నిజాయితీగా పని చేస్తున్నట్లు తనకు తాను చెప్పుకొంటున్న స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందన్నారు. ఆయనతోపాటు, ఆయన కుటుంబ సభ్యుల పాత్ర ఇందులో ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యేలు మంచివారు, నీతివంతులు అని చెప్పుకొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు.. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అవినీతి మేతను ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. దీన్నిబట్టి ప్రభుత్వం అండదండలతోనే ఇదంతా జరుగుతోందన్న అనుమానం వ్యక్తమవుతోందని చెప్పారు. అధికారులు కేసులు నమోదు చేస్తున్నా.. ఉన్నతాధికారులపై కొంత మంది ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేసి, మరలా ఆ వాహనాలను విడిపించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి ఒక్క పాలకొండ నియోజకవర్గంలోనే రూ.100 కోట్ల మేర గండి పడిందని.. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపిస్తే వాస్తవాలు నిగ్గు తేలుతాయని అన్నారు. నాగావళి, వంశధారల్లో రాత్రీపగలూ తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు సాగిపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

పోలమాంబ సిరిమానోత్సవం చూతమురారండి

- నేడు శంబర పోలమాంబ సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం
- 3 లక్షల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనా
- శంబరకు చేరుకున్న 700 మంది పోలీసులు
- భక్తుల రాకపోకలకు 130 ఆర్టీసీ బస్సులు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



క్యూలు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (ఇన్‌సెట్లో) చదురుగుడిలో పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవానికి సర్వం సిద్ధమైంది. శంబర గ్రామం భక్తులతో కళకళలాడుతోంది. అమ్మవారికి జరిపే ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో సిరిమానోత్సవం ఆరంభం కానుంది. పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించనున్నారు. దీనికోసం 36 అడుగుల సిరిమాను, రథాన్ని సిద్ధంచేశారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు, ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

దేవదాయశాఖ ఏర్పాట్లు పూర్తి

జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 30వేలు లడ్డూ ప్రసాదం, అవసరమైన మేరకు పులిహోరా ప్రసాదాన్ని సిద్ధంచేశారు. జాతరలో 60 మంది వరకు దేవదాయశాఖ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. చదురుగుడి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన క్యూల నుంచి ఉచిత, రూ.20, రూ.100 దర్శనం కల్పించనున్నారు. క్యూల వద్ద చిన్నారులకు పాలు, భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. వనంగుడి, చదురుగుడి, రామాలయం, గ్రంథాలయం వద్ద ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటుచేశారు. గోముఖినది తీరాన మరుగుదొడ్లు, భక్తులు దుస్తులు మార్చే గదులను ఏర్పాటుచేశారు. భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు, మొక్కుబడులు చెల్లించేందుకు వీలుగా టెంట్‌లు ఏర్పాటుచేశారు.

130 బస్సు సర్వీసులు

జాతరకు సాలూరు, పార్వతీపురం, పాలకొండ, విజయనగరం, శ్రీకాకుళం డిపోల నుంచి 130 ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులు నిర్ణయించారు. ఈ సర్వీసులు జాతర ముగిసే వరకు ఉంటాయని తెలిపారు.

- జాతరలో పారిశుద్ధ్య పనుల కోసం సాలూరు, పార్వతీపురం తదితర మున్సిపాల్టీల నుంచి సుమారు 120 మంది పారిశుద్ధ్యకార్మికులను నియమించారు. ఎప్పటిచెత్త అప్పుడే తరలించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.
- జాతరలో 8చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. వనంగుడి, చదురుగుడి క్యూలైన్లు, రామాలయం, అంగన్‌వాడీకేంద్రం, పీహెచ్‌సీ, కవిరిపల్లి, చెముడు, ఎస్.పెద్దవలస గ్రామాల్లో వైద్యశిబిరాలు కొనసాగుతాయి. ప్రతీ శిబిరంలోనూ మెడికల్ ఆఫీసర్‌తో పాటు, సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- గ్రామంలోని వనంగుడి, రామాలయం, ప్రధానవీధి, క్యూలైన్ల వద్ద నాలుగు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు.



సిరిమానోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

700 మంది పోలీస్ బందోబస్తు

జాతరలో 700 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. 41 సీసీ కెమెరాలు, డ్రోన్ల సాయంతో పోలీస్ ఉన్నతాధికారులు కంట్రోల్‌రూమ్ నుంచి జాతరను పర్యవేక్షించనున్నారు. జాతరలో ఎస్పీ వి.మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, పీసీలు, రోప్‌పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. జాతరకొచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా రోడ్డుమ్యాప్‌ను ఏర్పాటుచేశారు. జాతరకు వచ్చిన భక్తులు 100 నంబర్‌కు ఫోన్‌చేస్తే, రూట్ పెట్రోలింగ్ పార్టీ చేరుకొని, ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు. ఏర్పాట్లను ఎస్పీ మంగళవారం పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఐదుచోట్ల పార్కింగ్ ప్రదేశాలు..

శంబర గ్రామానికి చేరుకునే వాహనదారులకు ఐదుచోట్ల పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. మక్కువ నుంచి కవిరిపల్లి గ్రామం మీదుగా శంబర గ్రామానికి కేవలం ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు రాకపోకలకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. మిగిలిన ఆటోలు, ఇతరత్రా వాహనాలను మక్కువ మీదుగా చెముడు గ్రామం నుంచి శంబర చేరుకోవాల్సి ఉంది. సన్యాసిరాజపురం, కవిరిపల్లి, తోటవలస గ్రామాల్లో ముత్యాలమ్మ పండగ జరగనున్న నేపథ్యంలో ఆయా గ్రామాలకు బంధువులు చేరుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి. కవిరిపల్లి మీదుగా శంబర చేరుకున్న వాహనదారులకు శంబర పీహెచ్‌సీ పక్కన, చెముడు మీదుగా చేరుకున్న వాహనాలకు గోముఖీనది వద్ద, మామిడిపల్లి మీదుగా వచ్చే వాహనాలు వీఆర్ఎస్ ప్రాజెక్ట్‌వద్ద, మావుడి నుంచి చేరుకునే వాహనాలు హాస్టల్‌వద్ద, ఎస్.పెద్దవలస మీదుగా వచ్చే వాహనాలకు గ్రామశివారులో స్థలాలను కేటాయించారు.



సిద్ధమైన సిరిమాను రథం

సిరిమాను సిద్ధం:

సాలూరు మండలం కందులుపదం గ్రామం నుండి ఆదివారం తీసుకువచ్చిన తాడిచెట్టును గ్రామానికి చెందిన వడ్రంగులు సిరిమాను, గుజ్జుమానుగా మలచి, నాటుబండిపై సిరిమానును సిద్ధం చేశారు. సిరిమాను 36 అడుగులు సిరిమానును గ్రామస్తులు, ఉత్సవకమిటీ సభ్యులు, మాజీ ట్రస్ట్ బోర్డుచైర్మన్లు, గ్రామపెద్దలు సిద్ధంచేశారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజలందరికీ చేరువయ్యేలా పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకునేందుకు, మిగులు విద్యుత్‌ను విక్రయించి అదనపు ఆదాయం పొందేందుకు సూర్యఘర్ పథకం దోహదం చేస్తుందన్నారు. రక్తహీనత నివారణకు మరింత కృషిచేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రా రెడ్డి, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


అదృశ్యమైన దత్తి చైతన్య

నెల్లిమర్ల రూరల్: మండలంలో కొండవెలగాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన దత్తి చైతన్య(17) కొండవెలగాడలో ఇంటర్ చదువుతున్నాడని ఈ నెల 23న కళాశాల నుంచి బయటకి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి చేరుకోలేదన్నారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అదృశ్యమైన వివాహిత మృతి


నూతిలోనుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం


కంచిపాటి వాణి (ఫైల్)

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన అదృశ్యమైన మహిళ కంచిపాటి వాణి (46) మృతి చెందినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్సై అందజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వాణి మతిస్థిమితం లేక శనివారం సాయంత్రం ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీనిపై భర్త, కుటుంబసభ్యులు వెతికినప్పటికీ కనిపించకపోవడంతో వాణి తండ్రిఅరిగి అప్పలసూర్యనారాయణ ఆదివారం ఫిర్యాదు చేశారు. సోమవారం బొద్దాం సమీపంలో నూతిలో వాణి మృతదేహం తేలినట్లు సమాచారం రావడంతో మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డైరెక్టర్ వైఖరి సరికాదు

పార్వతీపురంటౌన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెడతామని చెప్పడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రవీణ్ ప్రకాశ్ మాదిరిగానే వ్యవహరిస్తున్నారని, వైఖరి మార్చుకోకపోతే గుణపాఠం చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు.





- అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు
- ఏఎస్పీ దిలీప్‌కిరణ్ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు
- ఉత్సవంలో పాల్గొన్న రైతులు

కనుల పండువగా.. పోలమాంబ తొలేళ్లు


కోళ్లు,మేకలు చెల్లిస్తున్న గిరిజనులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు వివిధ ప్రాంతాలనుంచి శంబర గ్రామానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కుటుంబసభ్యులతో సోమవారం ఉదయం శంబర చేరుకున్నారు. చదురుగుడిలో, వనంగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు దర్శించుకోగా, ఈవో వీవీ సూర్యనారాయణ సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. చదురుగుడిలో అమ్మవారి ఘటాలకు కలెక్టర్ దంపతులు పూజలు నిర్వహించి, తలపై అమ్మవారి ఘటాలను ఎత్తుకున్నారు. అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ జాతర బందోబస్తుపై పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు.

తొలేళ్ల ఉత్సవం సాగిందిలా..

ఆదివారం రాత్రి 11గంటల సమయంలో అమ్మవారి ఘటాలకు తిరువీధి చేసిన అనంతరం, కారుగేద వాలకాలను నిర్వహించారు. మహిషాసుర మర్దిని వేషధారణ, పోతురాజు వేషధారణ, మేళతాళాల నడుమ కారుగేదవాలకం జరిపించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉపవాసాలు ఆచరించి, గ్రామపెద్దలంతా జన్నివారిని పిలిచి రాత్రి 10గంటలకు ఏరోత్సవం నిర్వహించారు. జన్నివారి, గిరిడవారి ఇళ్లనుంచి విత్తనాలను తీసుకువచ్చి అమ్మవారి వద్ద విత్తనాలు ఉంచి, పూజలు నిర్వహించారు. అమ్మవారికి అక్షింతలు చల్లి పూజచేసి, రైతులు కాడిపై(పశువుల ఏరుకు పూసిన పూజు) నిలబడి రైతులు మొక్కులు చెల్లించారు. విత్తనాలను రైతులంతా వారివారి ఇళ్లకు తీసుకు వెళ్లారు. ఖరీఫ్‌సాగులో ఈ విత్తనాలు కలిపి పంటలు సాగుచేయడం ఆనవాయి తీగా వస్తోంది.



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

పోలమాంబ అమ్మవారిని భక్తులు సోమవారం దర్శించుకున్నారు. గోముఖీ బ్రిడ్జి వద్ద కోళ్లు, మేకలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వనంగుడి వెనుక ఉన్న పురాతన వేపచెట్టుకు పూజలు చేశారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అమ్మవారికి ఘటాలను భక్తులు మొక్కుబడిగా చెల్లించారు. చీపుళ్లతో వీధిరహదారులును శుభ్రంచేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. కురుపాం మండలం మూలిగూడ గ్రామానికి చెందిన సుమారు 50మంది గిరిజనులు జాతరకు చేరుకుని, అమ్మవారికి మేకలు, కోళ్ల మొక్కుబడులు చెల్లించి గోముఖినది వద్ద వంటావార్పు చేసుకున్నారు.

జాతర బందోబస్తుకు చేరుకున్న పోలీసులు

ఎస్పీ వి.మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్‌ల పర్యవేక్షణలో జాతర బందోబస్తుకు శంబర గ్రామానికి సోమవారం ఉదయం పోలీసులు చేరుకున్నారు. ఏఎస్పీ దిలీప్‌కిరణ్ జాతరలో బందోబస్తుపై సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. జాతరలో ఎస్టీఎఫ్ బలగాలు పహారా కాశాయి.


పోలీస్‌సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్


పహారా కాస్తున్న ఎస్టీఎఫ్ బలగాలు


తలనీలాల మొక్కు చెల్లిస్తున్న చిన్నారి


తలపై ఘటాలు ఎత్తుకున్న కలెక్టర్ దంపతులు


కారుగేదవాలకం

జాతర ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. క్యూలు, తాగునీటి సౌకర్యం, ప్రసాదాలు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, దుస్తుల మార్పిడి గదులు, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ షేక్‌ఇబ్రహీం, ఈవో వీవీ సూర్యనారాయణలకు సూచించారు. గ్రామానికి చెందిన వడ్రంగులు సిరిమానును సంప్రదాయ పద్ధతుల్లో మలిచారు.

వినతుల పరిష్కారంలో జాప్యం ఉండకూడదు

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్


వినతుల స్వీకరణలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని ఇంకనూ చూడవలసిన క్రమంలో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అన్నారు. వివిధ శాఖల అధికారుల వద్ద చూడకుండా ఉన్న వినతులు వెంటనే చూసి పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుంచి 174 వినతులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ పదే పదే దరఖాస్తులు పెట్టేవారు, అలవాటుగా ప్రతి వారం పెట్టేవారి వివరాలను సమర్పించాలని వారి వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 34 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 34 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, పిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే .చౌదరి, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


వినతులను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ హేమలత


ట్రై సైకిల్‌ను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డిలు అర్జీదారులనుంచి 105 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేసి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలని, అర్జీలను ఆడిటింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కార ప్రగతిపై ప్రతివారం సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సరైన కారణాలను అర్జీదారుకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్‌మోహన్ రావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎస్. మన్మథరావు, డ్వామా, డీఆర్‌డీఏ పథక సంచాలకులు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ట్రైసైకిల్ పంపిణీ

తాను వికలాంగుడినని, నడవలేనని పీజీఆర్‌ఎస్‌లో ట్రైసైకిల్ కావాలని దరఖాస్తు చేసుకున్న సీతానగరం మండలం కోటసీతారాంపురం గ్రామానికి చెందిన సీతారాములుకు ట్రైసైకిల్‌ను సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అందజేశారు. దివ్యాంగులకు ప్రభుత్వ అందజేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదని ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 9 అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలపై విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఐకాన్ పురస్కారానికి రామినాయుడు ఎంపిక


సత్యకీర్తి వేషధారణలో రామినాయుడు

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయపురం గ్రామానికి చెందిన నిలురౌతు రామినాయుడు గత 45 సంవత్సరాల నుంచి పౌరాణిక నాటక రంగంలో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక, వివేకానంద జయంతి ఉత్సవాలు–2025ను పురస్కరించుకుని ఇండియన్ ఐకాన్ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు. ఈ అవార్డును ఫిబ్రవరి 2న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం చేస్తారని, అవార్డు తీసుకునేందుకు నిర్వాహకులనుంచి ఆహ్వానం అందిందని రామినాయుడు తెలిపారు.

రూ.110 కోట్లతో ట్రైకార్ పథకాలకు ప్రతిపాదనలు

- ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు • గిరిజన గ్రామాల్లో పర్యటన


గిరిజనులతో మాట్లాడుతున్న ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు

సీతంపేట: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ట్రైకార్ పథకాల అమలుకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పెట్టినట్టు ట్రైకార్ రాష్ట్ర ఛైర్మన్ బి.శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు సీతంపేట ఏజెన్సీలో సోమవారం ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయిలో పలు గ్రామాల్లో ఐటీడీఏ అమలు చేస్తున్న పథకాలను పరిశీలించారు. కిరాణాషాపులు, టెంట్‌హౌస్‌లు, వాహనాలు, సూపర్‌బజార్‌లు గిరిజనులు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా 90 శాతం సబ్సిడీపై రుణాలు ఇవ్వనున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మోహన్‌కాలనీ, బిల్లగూడ గ్రామాల్లో మారిషస్ పైనాపిల్ వేసిన రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించనున్నామన్నారు. సోలార్ తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరారు. పులిపుట్టి గోకులం షెడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను సందర్శించి విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహం పరిశీలించారు. మెట్టుగూడ జలపాతం, అడ్వెంచర్ పార్కును సందర్శించారు. అనంతరం స్థానిక ఐటీడీఏలో పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. రహదారులు, ఇతర భవనాల ప్రగతిని పీఓ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్లు కె.కృష్ణారావు, పి.లావణ్య, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌వో గణేష్ పాల్గొన్నారు.

నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారులు

- నేటినుంచి హైదరాబాద్‌లో పోటీలు


నేషనల్ తైక్వాండో పోటీలకు వెళ్లనున్న క్రీడాకారులు

విజయనగరం: ఈ నెల 28 నుంచి 30 వరకు 40వ సీనియర్, 7వ క్యాడెట్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరగనున్నట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీ.హెచ్.వేణుగోపాలరావు తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. వారికి అసోసియేషన్, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ నుంచి ట్రాక్ షూట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, జిల్లా తైక్వాండో చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అభినందనలు తెలుపుతూ పతకాలతో తిరిగి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర తైక్వాండో టీమ్‌కు కోచ్‌గా కె.చైతన్య వ్యవహరిస్తున్నట్లు ఆయన చెప్పారు.